స్వావలంబి భారత్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్‌గా రమేశ్ గౌడ్

రమేశ్ గౌడ్

హిమాయత్‌నగర్, జూలై 3: ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని లక్నో, అయోధ్యలో జరిగిన స్వదేశీ జాగరణ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ జాతీయ కార్యవర్గ సమావేశంలో స్వావలంబి భారత్ అభియాన్ రాష్ట్ర కన్వీనర్‌గా జి.రమేశ్ గౌడ్, కో-కన్వీనర్‌గా బి.ఇంద్రసేనారెడ్డి నియమితులయ్యారు. అఖిల భారత స్వదేశీ జాగరణ మంచ్ కన్వీనర్ సుందరం వీరికి నియామక పత్రాలను అందజేశారు.

హిమాయత్‌సాగర్‌లో మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్, జూలై 3 : హిమాయత్‌సాగర్ జలాశయంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది.సీఐ బాలరాజు కథనం ప్రకారం ... బుధవారం చెరువులో ఓ వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఉస్మానియా దవాఖానకు తరలించారు.మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏండ్లు ఉంటుందన్నారు.చామన చాయ రంగులో ఉన్న వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే ఆర్‌జీఐఏ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

కార్మికులు హక్కులను కాపాడుకోవాలి

హిమాయత్‌నగర్, జూలై 3: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు తమ హక్కులను కాపాడుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశం పిలుపునిచ్చారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం విధానాన్ని అమలు చేసి, కార్మికులకు సామాజిక భద్రత కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

- నర్కూడ గ్రామంలో పలు అభివృద్ధి పనులు ప్రారంభం
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, తదితరులు

శంషాబాద్ రూరల్, జూలై 3 : గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. బుధవారం శంషాబాద్ మండలంలోని నర్కూడ గ్రామంలో రూ.30 లక్షలతో గత ప్రభుత్వం ప్రత్యేక నిధులతో నిర్మాణం చేసిన తరగతి అదనపు గదులు, రూ. 15 లక్షలతో నిర్మాణం చేసిన సీసీరోడ్డు, జిల్లా పరిషత్ నిధులతో చేపట్టిన బీసీ కమ్యూనిటీహాల్ మొత్తం రూ.78లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం జడ్పీటీసీ నీరటి తన్విరాజు సహకారంతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, ఇందులో భాగంగానే అభివృద్ధి పనులకు నిధులు కేటాయించామని తెలిపారు. సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ తెలంగాణలో మొగలుల పాలనను అంతం చేసి బహుజన పాలనకు శ్రీకారం చుట్టిన ధీరుడని కొనియాడరు. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసి అభివృద్ధి చేశారని తెలిపారు. వరుసగా తనను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించిన నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్విరాజు, వైస్ ఎంపీపీ నీలం, సహకార సంఘం అధ్యక్షుడు సతీశ్, ఎంపీటీసీ గౌతమి, ఎంపీడీవో మున్ని, మండల పార్టీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డి, నాయకులు నీరటి రాజుముదిరాజ్, మాజీ సర్పంచ్ దండు ఇస్తారి, వెంకటేశ్ గౌడ్, విశ్వనాథం, టి. కుమార్‌గౌడ్, డీఈ కుమార్‌గౌడ్, శివాజీ, నగేశ్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు శేఖర్‌ముదిరాజ్, రవీందర్‌నాయక్, శ్రీకాంత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నర్కూడ గ్రామంలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ , తదితరులు

మోడల్ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలి

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

చిరు వ్యాపారుల సమస్యలను తెలుసుకుంటున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

హిమాయత్‌నగర్,జూలై 3: చిరు వ్యాపారుల కోసం నిర్మించిన మోడల్ మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. బుధవారం నారాయణగూడలో ఆమె ఆకస్మికంగా పర్యటించి శానిటేషన్ పనులను పరిశీలించారు. అనంతరం నారాయణగూడ పై ఓవర్ సమీపంలో నూతనంగా నిర్మించిన మోడల్ మార్కెట్ పనుల విషయాన్ని అక్కడే ఉన్న చిరు వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ నిర్మాణం పూర్తి కావడంతో అర్హులైన వ్యాపారులకు గదుల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రోడ్లపైనే చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని వీలైనంత త్వరగా మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కిరణ్, అంబర్‌పేట సర్కిల్- 16 ఏఎంహెచ్‌వో హేమలత, ఎస్ఎస్ తిరుపతి నాయక్, ఎస్ఎఫ్ఏ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మంచిరేవుల ముదిరాజ్‌ల శ్మశానవాటికలో బోర్ వెల్ పనులను ప్రారంభిస్తున్న నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణశ్రీనివాస్

మణికొండ, జూలై 3: శ్మశానవాటికలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. మంచిరేవుల ముదిరాజ్‌ల శ్మశానవాటిలో బుధవారం బోర్ వెల్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శ్మశానవాటికలో నీటి వసతి లేక ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి తీసుకురావడంతో వెంటనే బోరు వేయించామన్నారు. ప్రజలకు ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకువస్తే వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గండయ్య, నర్సింహ, వీరయ్య, సత్తయ్య, లక్ష్మణ్, కిరణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రైతు బంధు పథకానికి అర్హులను ఎంపిక చేయాలి

శంషాబాద్ రూరల్, జూలై 3: రైతు బంధు పథకానికి అర్హులను ఎంపిక చేయాలని చిన్న గోల్కొండ సహకార సంఘం చైర్మన్ దవణాకర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని చిన్న గోల్కొండ గ్రామంలోని సహకార సంఘం ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు బంధు పథకం, రైతు భరోసా పథకానికి అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. గత ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు లేకుండా అమలు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి కవిత, సహకార సంఘం సభ్యులు మోహన్‌రావు, దేవేందర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పాశం విజయలక్ష్మి, సీఈవో యాదయ్య, సురేశ్, మధుమతిలతో పాటు పలువురు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సహకార సంఘం సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దవణాకర్ గౌడ్, తదితరులు

బ్యాంకు ఖాతాను హ్యాక్ చేసి డబ్బు అపహరణ

వెంగళరావునగర్, జూలై 3: బ్యాంకు ఖాతాను హ్యాక్ చేసి డబ్బు అపహరించిన ఘటన పై మధురానగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రహ్మత్‌నగర్‌లో నివాసం ఉండే ప్రైవేట్ ఉద్యోగి ఎ.నాగమల్లయ్య(44)గత నెల 26న సీఆర్ఈడీ యాప్ ద్వారా రూ.90 వేల రుణం కోసం దరఖాస్తు చేసుకోగా రూ.86,157 డబ్బు అతడి అకౌంట్‌కు జమ అయింది. ఆ తర్వాత తన స్నేహితురాలికి డబ్బు అవరసమైతే ..రూ.60 వేలు గూగుల్ పే ద్వారా పంపించారు. కొంత సమయం తర్వాత బ్లింకింగ్ స్క్రీన్‌తో అలర్ట్ వచ్చింది. అతడి ఫోన్‌కు ఆధార్ ఓటీపీ వచ్చింది. అనుమానించి బ్యాంకు అకౌంట్ బ్యాలెన్స్‌ను చెక్ చేసుకునేందుకు ప్రయత్నించగా అది పని చేయలేదు. బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ఖాతాను హ్యాక్ చేసినట్లు తెలిపారు. రూ.26,500 డబ్బు అపహరణకు గురైనట్లు తెలుసుకుని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని మధురానగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హిమాయత్‌సాగర్ జలాశయంలో 22 కిలోల చేప

శంషాబాద్ రూరల్, జూలై 3 : హైదరాబాద్ నగర శివారులోని హిమాయత్‌సాగర్ జలాశయంలో శంషాబాద్ మండలంలోని కొత్వాల్‌గూడ గ్రామానికి చెందిన గుంటి చరణ్‌కుమార్ అనే జాలరు రోజుమాదిరిగా చెరువులో మంగళవారం రాత్రి వల వేసి బుధవారం ఉదయం తీశాడు. వలను తీసి చూడగా పెద్ద చేప చిక్కింది. చేపను తీసుకొని ఒడ్డుకు వచ్చి తూకం వేయగా 22 కిలోలు ఉంది.

జాలరు చరణ్‌కుమార్‌కు చిక్కిన 22 కిలోల చేప

ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం సమర్పిస్తున్న బాలు నాయక్, శివకుమార్ తదితరులు

గ్రంథాలయాల్లో పదోన్నతులు కల్పించాలి

ఖైరతాబాద్, జూలై 3 : రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏండ్ల తరబడి లైబ్రేరియన్లుగా పనిచేస్తున్నా.. పదోన్నతులు కల్పించకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తుందని తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలల లైబ్రేరియన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.బాలు నాయక్, ఓ.శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఓ కార్యక్రమానికి వచ్చిన ప్రొఫెసర్ కోదండరాంకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ఏపీపీఎస్సీ ద్వారా 1994లో లైబ్రేరియన్లుగా విధుల్లో చేరామని, నాటి నుంచి నేటి వరకు తమకు పదోన్నతులు కల్పించలేదన్నారు. జీవో నం.302 సర్వీస్ రూల్స్ ప్రకారం తమకు ప్రిన్సిపాల్ అయ్యే అర్హత ఉందని, కాని ఆ దిశగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వారి వెంట సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ఆర్.మంజు నాయక్, ఆర్థిక కార్యదర్శి జి.రాములు నాయక్, సహాయ కార్యదర్శి కె.సరస్వతి, మహిళా విభాగం కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

మణికొండ, జూలై 3: సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేద ప్రజలకు అండగా నిలవాలని ఉత్తమ ఉపాధ్యాయ రాష్ట్రపతి పురస్కార గ్రహీత సతీశ్‌కుమార్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ మణికొండ, భారత్ వికాస్ పరిషత్ (ఆర్యభట్ట బ్రాంచ్, హైదరాబాద్), ఎంప్లాయీస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నేతృత్వంలో సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఎస్ఆర్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే మణికొండలో పారిశుధ్య కార్మికులకు భోజన సామగ్రి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శుభకార్యాలు, పుట్టిన రోజు వేడుకలను వృద్ధాశ్రమాల్లో జరుపుకోవడం ద్వారా ఆశ్రమంలో ఉంటున్న వారికి ధైర్యాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, రమేశ్, బాబు, పెంటారెడ్డి, అంజనాదేవి, రామానుజం, సుగుణరాజు, బాపు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు భోజన సామగ్రి పంపిణీ చేస్తున్న సతీశ్‌కుమార్ తదితరులు

కాంట్రాక్టర్ నిర్వాకంతో పగిలిన పైపులైన్..

జలమండలి ఎండీ స్పందించడంతో సత్వర పరిష్కారం

ఎన్‌బీటీ నగర్‌లో ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చర్యలు

పైపులైన్ పగిలిపోయి వృథాగా పోతున్న తాగునీరు

పగిలిన చోట కొత్త పైపులైన్ వేస్తున్న జలమండలి సిబ్బంది

జూబ్లీహిల్స్, జూలై 3 : జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ నిర్వాకంతో జలమండలి పైపులైన్ పగిలి పెద్ద ఎత్తున నీరు వృథా కావడంతో పాటు నీటి సరఫరా నిలిచిపోయి పలు ప్రాంతాల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. రెండు రోజుల క్రితం బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీ నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన పై స్వయంగా జలమండలి ఎండీ స్పందించడంతో సమస్య సత్వరమే పరిష్కారమైంది. ఎన్‌బీటీ నగర్ ప్రాంతంలో సీసీ రోడ్డు పనులు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన కాంట్రాక్టర్ తవ్వకాలు చేపట్టారు. ఈ పనుల్లో జలమండలికి చెందిన 300 ఎంఎం డయా పైపులైన్ పగిలిపోయింది. ఇది మెయిన్‌లైన్ కావడంతో పెద్ద ఎత్తున నీరు వృథా కావడంతో పాటు పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఎండీ ఆదేశాలతో వెంటనే స్పందించిన జలమండలి అధికారులు తక్షణ సహాయక చర్యలు చేపట్టారు. జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్.. సెక్షన్ అధికారులతో కలిసి నీటి సరఫరా పునరుద్ధరణకు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో 30 ఎంఎం డయా పైపులైన్ పగిలిందని.. సుమారు వెయ్యి నుంచి 1500 మంది వినియోగదారులకు నీటి సరఫరాకు అంతరాయం కలిగిందని తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలకు ప్రత్యామ్నాయంగా వాటర్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశామని.. జలమండలి ఎండీ ఆదేశాలతో వెంటనే కొత్త పైపులైన్‌లు వేశామని తెలిపారు. ప్రత్యామ్నాయంగా నీటి సరఫరా చేపట్టడంతో పాటు వేగంగా మరమ్మతులు చేపట్టి బుధవారం నీటి సరఫరా పునరుద్ధరించామని చెప్పారు. కాగా అభివృద్ధి పనులు చేపట్టేటప్పుడు అధికారుల సమన్వయంతో చేపడితే ప్రజలకు ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయాన్ని స్థానికులు వ్యక్తం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న డా.మల్లీశ్వరి

పశు సంరక్షణే అభివృద్ధికి సూచిక

సాగుకు తోడు పశు పెంపకం

డైరెక్టర్ డా.మల్లీశ్వరి

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 3 : రాష్ట్రంలో పశు సంరక్షణే రైతు కుటుంబాలకు రక్ష అని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈఓ డా.మల్లీశ్వరి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు తెలంగాణ పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పశువైద్య కళాశాల సమావేశం మందిరంలో దక్షిణ ప్రాంతీయ పశు పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో సాగు భూములు, అటవీ ప్రాంతం అధికంగా విస్తారంగా ఉండటం వల్ల అనాధిగా పశు పెంపకం ఉండేదని, సాగుకు తోడుగా ఉండేదని గుర్తు చేశారు. పశువులను పెంచితే మనకు పాలతో పాటు వ్యవసాయ రంగానికి , ప్రకృతి మనుగడకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో పరిశోధన సంచాలకులు డా.ఏకాంబరం, విస్తరణ సంచాలకులు డా.మహేందర్, డీన్ డా.రఘునందన్ రైతుల సమస్యలపై కులంకషంగా చర్చించారు. పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకం , కోళ్లు , చేపల పెంపకంలో క్షేత్రస్థాయి సమస్యలు, పరిష్కార మార్గాల గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా.జ్ఞాన ప్రకాశ్, పశు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఉదయ్‌కుమార్, ప్రొ.సీహెచ్ సత్యనారాయణ, విశ్వవిద్యాలయ శాఖ అధిపతులు, శాస్త్రవేత్తలు, పశుసంవర్ధక శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా.. కారు ఢీకొని వ్యక్తి మృతి

హిమాయత్‌నగర్, జూలై 3: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణగూడ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్సై నరేశ్ కుమార్ కథనం ప్రకారం.. బషీర్‌బాగ్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి(45) బుధవారం రోడ్డు దాటుతున్న క్రమంలో టీఎస్ 09 ఈయు 7861 నంబర్ గల కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలైన వ్యక్తిని దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఉస్మానియా దవాఖాన మార్చురీకి తరలించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 040-2785 2579 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికులకు అన్యాయం చేయొద్దు..

శంషాబాద్ రూరల్, జూలై 3 : మధ్యాహ్న భోజన కార్మికులకు అన్యాయం చేయొద్దని సీఐటీయూ జిల్లా నాయకుడు నీరటి మల్లేశ్ కోరారు. బుధవారం శంషాబాద్ ఎంఈవో కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఆగస్టు నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అక్షయపాత్ర ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నారని, అదే జరిగితే వారికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు. అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షుడు గణేశ్, కార్మికులు పాల్గొన్నారు.

రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల..

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 3: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్షా రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల రీవాల్యూయేషన్ ఫలితాలను విడుదల చేశారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల నాలుగు, ఆరు, ఎనిమిదో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఎల్ఎల్ఎం నాలుగో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 24లోగా కళాశాలల్లో చెల్లించవచ్చు. రూ.200 అపరాధ రుసుముతో 30 వరకు చెల్లించాలని తెలిపారు.

GENERAL PUBLIC NOTICE

On behalf of My Client Y.Hema Chandra, S/o. Y.Ravi Prasad it is hereby informed to General Public that during travelling from Kondapur to Secunderabad Lost a bag containing the Original Sale Deed bearing No. 11078/2012, Dated 13-12-2012, Registered in the Office of SRO, Yadagirigutta which is executed by Kodipaka Lakshman, S/o. K.Anthaiah in favour of Puppala Bhagyamma and others. If it is found by anyone, kindly handover to the following address:

Sd/- **A.RAGHURAM,** Advocate
R/o. H.No. 1-98/6/66/4,
Arunodaya Colony,
Madhapur, Hyderabad,
Telangana-500 081,
Mobile No. 9182545962.

గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి చేవెళ్ళ రంగారెడ్డి జిల్లా

I.A.No. 1864 of 2021
in
O.S.No. 728 of 2021

మధ్యన
ఎన్. యాదమ్మ ...వాది
మరియు
ఎ. మల్లారెడ్డి మరియు ఇతరులు ...ప్రతివాదులు
శ్రీయుత
1. M/s. VKR Properties Private Limited rep.by it's Director
శ్రీ పి.వి. సుబ్బరాజు తండ్రి కీ.శే. లచ్చిరాజు, వయస్సు: 62 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం నివాసం:ఫ్లాట్ నెం. 203, ప్రీతి అపార్ట్‌మెంట్స్, మాధాపూర్, హైదరాబాద్.

పైన తెలిపిన వాది గౌరవనీయ జూనియర్ సివిల్ జడ్జి చేవెళ్ళ కోర్టులో ప్రతివాదుల పైన Suit For Partition and Separate Possession దావా సర్వే నంబర్ 159, విస్తీర్ణం ఎకరములు 1-21 గుంటలు, చేవెళ్ళ గ్రామం మరియు మండలము రంగారెడ్డి గల భూమిపై దావా వేసియున్నారు. అట్టి కేస్‌లో మీమల్ని ప్రతివాదిగా చేర్చారు. కావున గౌరవనీయ కోర్టు ఆర్డర్ ప్రకారం I.A.No. 1864 of 2021 తమరి హాజరుకై దావాను 09-07-2024 నాటికి మార్చియున్నారు. కావున తమరు 09-07-2024 నాడు ఉదయం 10.30 గంటలకు గౌరవనీయ కోర్టు యందు స్వయముగా లేదా న్యాయవాది ద్వారా హాజరు కాగలరు లేనిచో కోర్టువారు ఏకపక్ష నిర్ణయం గైకొందురు.

"కోర్టు ఆదేశానుసారము ఈ ప్రకటన జారీ చేయడమైనది"

సం/- శ్రీ పి. సంపూర్ణ ఆనంద్, అడ్వకేట్
ఇం.నం. 4-2-879/10/1
గౌతమి జూనియర్ కాలేజి దగ్గర
వికారాబాద్ మున్సిపాలిటీ & టౌన్
వికారాబాద్ జిల్లా. ఫోన్: 9440356499

గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి చేవెళ్ళ రంగారెడ్డి జిల్లా

O.S.No. 728 of 2021

మధ్యన
ఎన్. యాదమ్మ ...వాది
మరియు
ఎ. మల్లారెడ్డి మరియు ఇతరులు ...ప్రతివాదులు
శ్రీయుత
1. M/s. VKR Properties Private Limited rep.by it's Director
శ్రీ పి.వి. సుబ్బరాజు తండ్రి కీ.శే. లచ్చిరాజు, వయస్సు: 62 సంవత్సరాలు, వృత్తి: వ్యాపారం నివాసం:ఫ్లాట్ నెం. 203, ప్రీతి అపార్ట్‌మెంట్స్, మాధాపూర్, హైదరాబాద్.

పైన తెలిపిన వాది గౌరవనీయ జూనియర్ సివిల్ జడ్జి చేవెళ్ళ కోర్టులో ప్రతివాదుల పైన Suit For Partition and Separate Possession దావా సర్వే నంబర్ 159, విస్తీర్ణం ఎకరములు 1-21 గుంటలు, చేవెళ్ళ గ్రామం మరియు మండలము రంగారెడ్డి గల భూమిపై దావా వేసియున్నారు. అట్టి కేస్‌లో మీమల్ని ప్రతివాదిగా చేర్చారు. కావున గౌరవనీయ కోర్టు ఆర్డర్ ప్రకారం తమరి హాజరుకై దావాను 09-07-2024 నాటికి మార్చియున్నారు. కావున తమరు 09-07-2024 నాడు ఉదయం 10.30 గంటలకు గౌరవనీయ కోర్టు యందు స్వయముగా లేదా న్యాయవాది ద్వారా హాజరు కాగలరు లేనిచో కోర్టువారు ఏకపక్ష నిర్ణయం గైకొందురు.

"కోర్టు ఆదేశానుసారము ఈ ప్రకటన జారీ చేయడమైనది"

సం/- శ్రీ పి. సంపూర్ణ ఆనంద్, అడ్వకేట్
ఇం.నం. 4-2-879/10/1
గౌతమి జూనియర్ కాలేజి దగ్గర
వికారాబాద్ మున్సిపాలిటీ & టౌన్
వికారాబాద్ జిల్లా. ఫోన్: 9440356499